www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబరు 2024

జిఒ 85కు వ్యతిరేకరంగా నిరసన

ఏలూరు సిటీ :జిఒ 85కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ పిహెచ్‌సి డాక్టర్లు, అసోసియేషన్ వారు ఏలూరులోని డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదురుగా ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం ఏలూరులోని డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా కారు, బైక్ ర్యాలీ నిర్వహించారు. కోండ్రుపాడు పిహెచ్‌సి డాక్టర్ రమ్య మాట్లాడుతూ 30 శాతం ఉన్న ఇన్‌సర్వీస్ కోటాను 15 శాతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అవసరం లేదంటూ ఇచ్చిన ఈ జిఒను అటు డాక్టర్లకు, ఇటు సామాన్యులకు, గిరిజన వాసులకు పెనుశాపంలా మారిందన్నారు. కనీసం ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన కూడా తెలుపనివ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని డాక్టర్లు వాపోతున్నారన్నారు. కోవిడ్‌లో సైతం ప్రాణాలకు తెగించి ప్రభుత్వ వైద్యులు సేవలందించారన్నారు. అలాంటి తమకు కనీస హక్కులు లేకుండా కాలరాయడం అత్యంత బాధాకరమన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

కాలుష్యం 'కాటు'..!

పరిశ్రమల కాలుష్యంతో పంట కాలువలన్నీ విషతుల్యంగా మారుతున్నాయి. గోస్తనీ నది, యనమదుర్రు డ్రెయిన్, కొల్లేరు వంటివి అందుకు ప్రత్యక్ష నిదర్శనాలుగా చెప్పొచ్చు. 2014-19 మధ్య జిల్లాలోని పరిశ్రమల కాలుష్యంపై టిడిపి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అనేక సమావేశాలు నిర్వహించి, యాక్షన్ ప్లాన్‌ను రూపొందించినా ముందుకు సాగలేదు. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ విషతుల్యంగా మారిపోతున్నాయి. జనం అనేక అనారోగ్య సమస్యలతో విలవిల్లాడుతున్నారు. పరిశ్రమల కాలుష్యం, తాగునీటి కాలుష్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ప్రజలను రోగాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

కాలుష్యంతో అధ్వానంగా మారిన యనమదుర్రు డ్రెయిన్

పరిశ్రమల వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే
రెండు జిల్లాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణం
తణుకు-నుంచి భీమవరం మధ్యలో 21 పరిశ్రమల కాలుష్యం కాలువల్లోకి
కలుషితమైన గోస్తనీ, యనమదుర్రు
ఏలూరు, విజయవాడ పరిశ్రమల కాలుష్యమంతా కొల్లేరులోకి
ఆక్వా పరిశ్రమల వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే
విషతుల్యంగా తాగునీరు, భూగర్భ జలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తణుకు నుంచి భీమవరం మధ్యలో దాదాపు 21 పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలన్నీ గోస్తనీ, యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తున్నాయని 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి తేల్చింది. దీంతో తాగునీటి వనరులన్నీ కలుషితమవుతున్నాయని తేల్చి అప్పట్లో టిడిపి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ప్రకటించింది. పరిశ్రమలకు నోటీసులివ్వడం, తనిఖీలు చేయడం జరిగింది. అప్పట్లో కార్మిక శాఖామంత్రిగా ఉన్న పితాని సత్యనారాయణ వివిధ ప్రజాసంఘాలతోపాటు అనేక మందితో భీమవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతేకాకుండా భీమవరాన్ని ఆనుకుని, చుట్టుపక్కల ఉన్న 19 ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలు సైతం పంట కాలువల్లోకి విడిచిపెడుతున్నట్లు తేలింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే తుందుర్రు ఆక్వాఫుడ్ పార్క్ ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. పదేళ్ల గడిచినా ఇప్పటికీ పరిశ్రమల నుంచి పంట కాలువల్లోకి విడుదలవుతున్న కాలుష్యంపై కనీస చర్యలు లేకుండాపోయాయి. 2019-24 మధ్య పాలన సాగించిన వైసిపి ప్రభుత్వం కాలుష్యంపై పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇటీవల కాలంలో ఆక్వా మేత పరిశ్రమలతోపాటు ఆక్వాకు సంబంధించిన ఇతర యూనిట్లు పెరిగిపోయాయి. వాటి నుంచి వచ్చే వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది. దీంతో పంట కాలువల్లో కలుషితమైన నీటితోనే గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను నింపుతున్నారు. ఈ నీరు తాగేందుకూ పనికి రావడం లేదు. పశువులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి చాలాచోట్ల నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా తాగునీటి వనరులతోపాటు పీల్చే గాలిసైతం విషంగా మారుతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రజలు కేన్సర్‌తోపాటు అనేక అంతుబట్టని రోగాల బారిన పడుతున్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్న పరిస్థితి ఉంది. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో కాలుష్యంపై జిల్లా ప్రజానీకంలో మరోసారి చర్చ మొదలైంది. భీమవరం నడిబొడ్డున ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్‌ను చూస్తే కాలుష్యం ఎంత తీవ్రస్థాయికి చేరిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లాల విభజన తర్వాత భీమవరం జిల్లా కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రం చుట్టూ కాలుష్యకాసారంగా ఉంది. పరిశ్రమల కాలుష్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, తాగునీటి వనరులను, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అంతా కోరుతున్నారు.

కొల్లేరులోకి పరిశ్రమల కాలుష్యం

ఏలూరు జిల్లాలో అభయారణ్యంగా పేరొందిన కొల్లేరు పూర్తిగా కాలుష్యకోరల్లో చిక్కుకుంది. విజయవాడ, ఏలూరు నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వ్యర్థాలన్నీ కొల్లేరులోకి చేరుతున్నాయి. దీంతో 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు మొత్తం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చేపలు, రొయ్యల చెరువుల్లో వాడే వ్యర్థాలన్నీ కొల్లేరులోకి వదిలేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇతర ప్రాంతాల్లోని ఆక్వా పరిశ్రమలు, ఐస్ ఫ్యాక్టరీల పరిశ్రమల కాలుష్య వ్యర్థాలు సైతం చాలాచోట్ల పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. కొల్లేరులో మత్స్య సంపద అంతరించిపోతుంది. వలస పక్షుల రాక తగ్గిపోతుంది. జనం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేస్తే తప్ప గుక్కెడు నీరు దొరకని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే పరిశ్రమల కాలుష్యంపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి ముందుకు సాగాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమల కాలుష్యం పంట కాలువల్లోకి వచ్చి పడుతున్నా ఆ శాఖాధికారులకు మాత్రం పట్టడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కొంత హడావుడి చేసిన అధికారులు తర్వాత పట్టించుకున్న దాఖలాల్లేవు. జిల్లా ప్రజానీకం కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కాలుష్య నియంత్రణ శాఖ ఒకటి ఉందనే సంగతిసైతం జనం మరిచిపోయిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి అధికారులను రంగంలోకి దింపి తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

మారేడుమిల్లి జలపాతంలో..
ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతు

ప్రజాశక్తి - దెందులూరు/ఏలూరు స్పోర్ట్స్

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి మండలం జలతరంగిణి జలపాతం వద్ద ఒక్కసారిగా వరద రావడంతో ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరులోని ఆశ్రం మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్న సుమారు 14 మంది విద్యార్థులు ఆదివారం పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు మారేడుమిల్లి వెళ్లారు. వీరు జలతరంగిణి జలపాతం వద్ద ఉండగా భారీ వర్షం కారణంగా ఎగువ నుంచి వరద రావడంతో ఐదుగురు కొట్టుకుపోయారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టగా కాజ్‌వే వద్ద చిక్కుకున్న ఇద్దరిని సురక్షితంగా రక్షించినట్లు మారేడుమిల్లి సిఐ గోపాలకృష్ణ తెలిపారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. గల్లంతైన వారు సిహెచ్.హరిదీప్, కె.సౌమ్య, బి.అమృతగా గుర్తించారు. వీరంతా ఆశ్రం మెడికల్ కళాశాలలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరికి సంబంధించిన సమాచారం ఆశ్రం ఆసుపత్రి యాజమాన్యానికి చేరలేదని తెలిసింది. వీరు హాస్టల్ విద్యార్థులు కాదని, అందువల్ల తమకు సమాచారం రాలేదని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అదనపు ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక రెస్క్యూ టీమ్ ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. రక్షించిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరం ఎంఎల్‌ఎ శిరీషాదేవి విద్యార్థులను పరామర్శించారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. అల్లూరు జిల్లా కలెక్టర్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సౌమ్య (ఫైల్)

అమృత (ఫైల్)

హరిదీప్ (ఫైల్)

వరద బాధితుల జాబితాలు ప్రదర్శన

అభ్యంతరాలుంటే తెలపండి
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో భారీవర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్ట గణన ప్రక్రియ నిర్వహించగా అందులో 207 ఇళ్లకు సంబంధించి దెబ్బతిన్నట్టు సమాచారం నమోదు చేశారని, ఆ జాబితాను కలెక్టరేట్‌లో ప్రదర్శించినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. యాప్‌లో వరద నష్టాల నమోదుపై సంబంధిత అధికారులతో ఆదివారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భారీవర్షాలు, వరదల మూలంగా నష్టపోయిన ప్రాంతాల్లో ఏఒక్క బాధితుడికీ సహాయం అందలేదని చెప్పేందుకు వీల్లేకుండా రీవెరిఫికేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. జాబితాలో అభ్యంతరాలుంటే బాధితులు తక్షణమే సంబంధిత తహశీల్దార్, ఆర్‌డిఒల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీవర్షాలు, వరదల కారణంగా ఇళ్లు నష్టపోయిన బాధితులకు ఈ నెల 25న పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఎన్యూమరేషన్ చేసిన జాబితాను ఆయా గ్రామ సచివాలయాలు, తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లో కూడా ప్రదర్శిస్తారని, జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు తెలియజేస్తే, ఆ వివరాలను పునఃపరిశీలించి సంబంధిత యాప్‌లో సోమవారం నాటికి ఆధారాలతో సహా అప్‌లోడ్ చేయాలన్నారు. బ్యాంకు ఖాతా నెంబర్ నమోదులో ఏమైనా వ్యత్యాసం ఉంటే, వాటిని పరిశీలించి సరిచేయించాలన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను జిల్లాలో మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రతి కార్యాలయంలోనూ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంబంధిత కార్యాచరణ ప్రకారం కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. స్వర్ణాంధ్ర-2047కు సంబంధించి మండల స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దీనికి సంబంధించి క్యూఆర్ కోడ్‌తో విడుదల చేసిన పోస్టర్లను ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలన్నారు.

ఏచూరి, ఆర్ఎస్‌ల మృతి తీరని లోటు

ప్రజాశక్తి - నిడమర్రు

సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్)ల మృతి దేశానికి, కార్మిక, కర్షకులకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఎం పూర్వ జిల్లా కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజు సంతాప సభ నారపల్లి రమణారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ఆర్.లింగరాజు, గుడిపాటి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నేడు దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదంగా ఉన్న కార్పొరేట్ మతోన్మాద బిజెపిని నిలువరించడంలో సీతారాం ఏచూరి ప్రముఖ పాత్ర పోషించారని, ఆయన లేకపోవడం దేశానికి తీరని లోటని అన్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో ఏచూరి పాత్ర ప్రముఖమైందన్నారు. గొప్ప మేధావిని దేశం కోల్పోవడం భవిష్యత్తు భారతానికి తీరని లోటన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆర్ఎస్ రైతు కార్మిక ఉద్యమాలను నిర్మించి ఏజెన్సీలో వేలాది ఎకరాల గిరిజనులకు పంపిణీ చేయడంలో, భూ పోరాటాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. నరసాపురం ఎంఎల్‌ఎగా నాడు పనిచేసి చివరి వరకు కార్మిక, కర్షక విముక్తి కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, కంచం ప్రసాద్ పాల్గొన్నారు.

చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు

గ్రామాల్లో ఎపి రైతుసంఘం నేతల ప్రచారం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ఈ నెల 27న ద్వారకాతిరుమలలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని నారాయణపురం, గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి, పంగిడగూడెం గ్రామాల్లో రైతుసంఘం నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలను రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నవ సూర్యనారాయణ ఆవిష్కరించారు. వివిధ గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి అన్ని పంటల రైతులందరూ సదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రైతు సదస్సులో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరారు. మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల నుండి రాష్ట్ర రైతు సదస్సులో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బోయపాటి సత్యనారాయణ, గుర్రం రాంబాబు, తూంపాటి మురళి, గుర్రం పాపారావు, ఎల్.సోమరాజు, నందమూరి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల హాస్టళ్లలో సీసీ కెమెరాలు

జిల్లా బిసి సంక్షేమాధికారి నాగరాణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థినుల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా బిసి సంక్షేమాధికారి నాగరాణి తెలిపారు. జిల్లాలోని బిసి హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ సక్రమంగా అందిస్తున్నారా, జిల్లాలోని లేడీస్ హాస్టళ్లలో విద్యార్థుల భద్రత కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు వంటి ప్రశ్నలకు మంచి సమాధానాలను బిసి సంక్షేమాధికారి నాగరాణి ప్రజాశక్తితో పంచుకున్నారు.

ప్రశ్న: జిల్లాలో బిసి సంక్షేమ శాఖ ఎటువంటి విధులు నిర్వహిస్తుంది?

సంక్షేమశాఖలో మొదటిగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ అని రెండు రకాలు ఉంటాయి. ప్రీ మెట్రిక్ అంటే మూడో తరగతి నుంచి పదో తరగతిలోపు, పోస్టుమెట్రిక్ అంటే ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు ఉంటుంది. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి హాస్టల్ సౌకర్యం కల్పించి, పాఠశాలలకు పంపిస్తాం. వసతిగృహంలో ఒక వార్డెన్, ముగ్గురు వర్కర్స్, ట్యూటర్లను పెట్టి వారిని చక్కగా చదివిస్తాం. అదేవిధంగా మెనూ ప్రకారం మంచి భోజనం పెట్టి, వారిని బాగా చదివించి, ప్రయోజకుల్ని చేయడమే దీని లక్ష్యం.

ప్రశ్న: జిల్లాలో బిసి సంక్షేమ హాస్టళ్లు ఎన్ని ఉన్నాయి? వాటి పనితీరు ఎలా ఉంది?

బిసి వెల్ఫేర్‌లో 35 హాస్టళ్లు ఉన్నాయి. అందులో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 19, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు 16 ఉన్నాయి. అందులో విద్యార్థులు 2574 మంది ఉంటున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వేడి నీళ్లు కూడా అందిస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలోని బిసి హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ మెనూ సక్రమంగా అందిస్తున్నారా?

ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుని వారికి వేడివేడిగా అందిస్తున్నాం. వారంలో మూడు గుడ్లు పెడుతున్నాం. మూడు రోజులు చికెన్ పెడుతున్నాం. చిక్కీ ఇస్తున్నాం. ఉదయం టిఫిన్ రోజుకో వెరైటీ చొప్పున పెడుతున్నాం. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులకు స్నాక్స్ రోజుకోరకం ఇస్తున్నాం.

ప్రశ్న: బిసి హాస్టళ్లలో విద్యార్థులను ఏ విధంగా చదివిస్తున్నారు?

పిల్లలకు నైట్ టైమ్ ట్యూషన్స్ కండక్ట్ చేసి ట్యూటర్లని పెట్టి వారిని దగ్గరుండి చదివిస్తున్నాం. ఈ సంవత్సరం టెన్త్ క్లాస్ విద్యార్థులకు మంచి పర్సంటేజ్ రావాలని ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు పెడుతున్నాం. వీక్లీ టెస్ట్ కండక్ట్ చేసి ఎవరికైతే తక్కువ మార్కులు వస్తున్నాయో ఆ స్కూళ్లకు వెళ్లి సంబంధిత టీచర్లతో మాట్లాడి బాగా చదివేలా మోటివేట్ చేయాలని చెబుతున్నాం. విద్యార్థులు ఇంప్రూవ్ కావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతినెలా స్కూల్స్‌లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నాం. పిల్లలకు గ్రూప్ డిస్కషన్ పెట్టిస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో బిసి హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. దానిపై మీ స్పందన?

హాస్టల్ భవనాలు కొన్ని శిథిలావస్థలో ఉండడంతో వాటి మరమ్మతు కోసం కలెక్టర్ వారి ఆధ్వర్యంలో ఉన్న ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల డిపార్టుమెంట్స్‌కు చెప్పాం. వారి ద్వారా వచ్చిన ఎస్టిమేషన్‌ను సుమారు రూ.మూడు కోట్లు నిధుల కోసం డైరెక్టర్‌కు అర్జీ పెట్టాం. ఆ నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

గతంలో జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటివి ఉన్నాయి. ప్రస్తుతానికి స్కీమ్స్ మార్చారుగానీ మాకు ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ రాలేదు.

ప్రశ్న : హాస్టల్స్‌లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

సిబ్బంది కొరత లేదు.

ప్రశ్న: జిల్లాలోని లేడీస్ హాస్టల్‌లో విద్యార్థుల భద్రత కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆడపిల్లలు ఎవరైనా బయటకు వెళ్లాలంటే ఒక ఎస్కార్ట్‌ని ఇచ్చి పంపించి, మళ్లీ తీసుకొస్తున్నాం. పిల్లలు స్కూల్‌కి వెళ్లి టైమ్‌కి వస్తున్నారా, లేదా అనేది కూడా పర్యవేక్షిస్తున్నాం. వారికి ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలున్నా సిబ్బంది తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. ఈమధ్య జెడ్‌పి సిఇఒ సీసీ కెమెరాలు పెట్టాలన్నారు. ఆ సదుపాయం కల్పిస్తే ఇంకా మాకు బాగుంటుంది. గర్ల్స్ హాస్టల్ ఉన్న ఏరియాలో పోలీస్ పికెట్ పెట్టాలని కోరాం.

ప్రశ్న: మీరు జిల్లాలోని హాస్టళ్లను నెలలో ఎన్నిసార్లు తనిఖీ చేస్తున్నారు?

మేము నెలలో దాదాపు పది హాస్టళ్లను తనిఖీ చేయాలి. అయితే నేను 15 నుంచి 20 హాస్టళ్లను తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఏమైనా సమస్యలున్నాయా అనేది పర్యవేక్షిస్తున్నాను.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా

'ఇది మంచి ప్రభుత్వం'లో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి
ముసునూరు మండలంలో రూ.81 లక్షలతో పలు అభివృద్ధి పనులకుశంకుస్థాపన

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మండలంలోని గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రూ.81 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేపట్టారు. గుళ్లపూడి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, వలసపల్లిలో రూ.21 లక్షలు, ముసునూరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే రూ.మూడు వేల పెన్షన్‌ను, రూ.నాలుగు వేలకు పెంచడమే కాకుండా మూడు నెలల బకాయిలను కలిపి అందించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు ఐదు రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్నా క్యాంటీన్లను రాష్ట్రంలో అన్ని నగరాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రంలో 16,700 టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సిని ప్రకటించారని, వచ్చే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పట్టాలెక్కించడానికి విజన్ గల నాయకుడు చంద్రబాబు ఒక్కడే అని నమ్మి ప్రజలు రికార్డు స్థాయిలో సీట్లు అందించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా రాష్ట్రాభివృద్ధికి సిఎం కృషి చేస్తున్నారన్నారు. తనను కలిసి సమస్యలను తెలిపిన ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ఎక్కడా తాగునీరు సమస్య లేకుండా చూస్తానని, అవసరమైన ప్రదేశాల్లో బోర్లు ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నూజివీడు నియోజకవర్గంలో గతంలో మూతపడిన పరిశ్రమలను త్వరలో పున:ప్రారంభించి, తద్వారా మరింతమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. గుళ్లపూడి, గుడిపాడు గ్రామాల్లో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని రాగా వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గుళ్లపూడిలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ సమస్య, సీసీ రోడ్ల సమస్య ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గుడిపాడులో వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, మురుగునీటి దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు గద్దె రఘుబాబు, ఎం.బుజ్జియ, ఎం.సురేంద్ర, సిహెచ్.దామోదరరావు, ఎన్.సత్యనారాయణ, ఎ.సీతారామరాజు, తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

గిరిజనుల భూములు వారికే ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ :ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు చెందాల్సిన 1/70 చట్టం భూములపై గిరిజనేతరుల వద్ద సొమ్ములు తీసుకొని వారికి అనుకూలంగా తీర్పులు ఇస్తున్న కెఆర్.పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్‌పై సిబిసిఐడితో విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని, గిరిజనులకు చెందాల్సిన భూములు వారికే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని 1/70 చట్టం భూములపై గిరిజనులు కెఆర్.పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులో సుమారు వంద మందికిపైగా ఎల్‌టిఆర్.కేసులు పెట్టారని తెలిపారు. గిరిజనులు పెట్టిన కేసుల్లో 1/70 చట్టానికి చెందిన భూములపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ ఏకపక్షంగా విచారణ నిర్వహించి, గిరిజనేతరుల వద్ద సొమ్ములు తీసుకొని, గిరిజనులకు చెందాల్సిన భూములపై గిరిజనేతరులకు అనుకూలంగా తీర్పులు ఇస్తున్నారని తెలిపారు. గతంలో కెఆర్.పురం ఐటిడిఎ పిఒ సూర్యతేజ ఈ కేసులపై విచారణ చేసి గిరిజనులకు అనుకూలంగా తీర్పు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న తరుణంలో ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసి ఇన్‌ఛార్జిగా కెఆర్.పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్‌ను నియమించారన్నారు. జి.శ్రీనుకుమార్ గిరిజనులకు అన్యాయం చేస్తూ రూ.లక్షల అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఆఫీసులో పనిచేసే రికార్డు అసిస్టెంట్ మడకం భీమరాజు సహకరిస్తున్నారన్నారు. గిరిజనులు పెట్టిన ఎల్‌టిఆర్ కేసులు కొన్ని రికార్డులు మాయం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. జి.శ్రీనుకుమార్, రికార్డు అసిస్టెంట్ మడకం భీమరాజులపై సిబిసిఐడితో విచారణ జరిపించాలన్నారు.

వరల్డ్ ఫుడ్ ఇండియాకు కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రపంచ దేశాలన్నీ కలిసి నిర్వహిస్తున్న ప్రపంచ ఆహార కార్యక్రమంలో కొయ్యలగూడెం మండలానికి చోటు దక్కింది. వరల్డ్ ఫుడ్ ఇండియా నిర్వహణకు 2024 సంవత్సరం భారతదేశం వేదికగా నిలిచింది. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి 22 వరకు ఢిల్లీలో ఈ కార్యక్రమం వరల్డ్ ఫుడ్ ఇండియా పేరుతో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో తమ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పది జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పది జిల్లాలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ఉన్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వీ తెలిపారు. ఈ వరల్డ్ ఫుడ్ ఇండియాకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంపికైనట్లు ఆమె వివరించారు. ఆ గ్రామంలోని మథర్ థెరీసా మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు తోట కృపామణి తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంపికయ్యాయి. ఈ ఉత్పత్తుల ప్రదర్శనను తొలిరోజు కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించగా రెండో రోజు ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.భరత్ రాష్ట్ర స్టాల్స్ తిలకించి అభినందించినట్లు కృపామణి తెలిపారు. కనకాద్రిపురం ఉత్పత్తులు దేశ రాజధానిలో ఇతర దేశాలతో పాటు ప్రదర్శించారు. ఇతర దేశాల కార్పొరేట్ కంపెనీలతో పాటు కనకాద్రిపురం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు అక్కడ ప్రదర్శించటం గర్వంగా ఉందన్నారు. ఇప్పటికే తాము తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కోసం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫారంలో ఆన్‌లైన్ సదుపాయాన్ని కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ కల్పించామన్నారు. మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగు పరచటానికి జిల్లా అధికారులు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ఎక్కువ మంది మహిళలకు రుణ సదుపాయం కోసం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా, స్త్రీ నిధి డైరెక్టర్‌గా తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

స్టాల్స్‌ను తిలకిస్తున్న వక్తలు

ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆదివారం బదిలీ ఉత్తర్వులు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17న ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసినందున, ఈ బదిలీలు చేపట్టబడ్డాయి. ఈ బదిలీల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలోని అన్ని కేడర్లలో 429 మందిని బదిలీలు చేశారు. ఈ మేరకు, బదిలీ ఆదేశాలు ఆదివారం సంబంధిత ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బదిలీలు ఉద్యోగుల పనితీరు మెరుగుపరచడానికి, సేవల నాణ్యతను పెంచడానికి చేపట్టిన చర్య అని తెలిపారు. ఉద్యోగులు తమ కొత్త స్థానాల్లో సమర్థవంతంగా పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ముఖ్య కార్య నిర్వాహణ అధికారి కె.ఎస్.ఎస్.సుబ్బారావు, ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి ఎస్.నిర్మలజ్యోతి, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ పంచాయతీలో ఆదివారం సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి అల్లిత్రి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలైన గ్లౌజులు, బూట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పంచాయతీ పారిశుద్ధ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కూడా పంచాయతీ అభివృద్ధికి అవసరమేనన్నారు. అందుకే పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు చిన్న నాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.జయబాబు సూచించారు. మండలంలోని బొర్రంపాలెం డిసిబిడి హాస్టల్ విద్యార్థులతో ఆదివారం చట్టాలు, నేరాలపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు నేరాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎఎస్ఐ విజయకుమార్ ఉన్నారు.

'గ్రామాలాభివృద్ధే ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ధ్యేయం'

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామాలాభివృద్ధే చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ధ్యేయమని టిడిపి నాయకులు, పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు తాటి అప్పారావు, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు తాటి మణిచంద్రసింహ, బిసి సెల్ స్టేట్ సెక్రెటరీ మారిరెడ్డి రాంప్రసాద్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని నందమూరి విద్యానగర్ కాలనీలో లింక్ రోడ్డు బాగా దెబ్బతిని స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా నందమూరి విద్యానగర్ కాలనీవాసులు ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చుండ్రు ప్రసాదరావు, నాగరాజు, మారుమూడి రాజేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొర్రగుంటపాలెం ఇమ్మానియేల్ ప్రార్థన మందిరం పాస్టర్లు వి.సూర్యనారాజు, వి.విజయకుమార్, ఇమ్మానుయేల్ గాస్పెల్ వాయిస్ టీమ్‌తో కలిసి వరద బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం కె.కొత్తపాలెం గ్రామంలోని కృష్ణానది కరకట్ట ప్రాంతంలో వరదల కారణంగా ఇళ్లు ముంపుకు గురై సర్వం కోల్పోయిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌సిఐ జాతీయ నాయకుడు పీటర్ పుట్ట, పాస్టర్ శాలెం ఇమ్మానియేల్, గాస్పెల్ వాయిస్ టీం సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23వ తేదీ సోమవారం నూజివీడు నియోజకవర్గంలోని సఫాయి మిత్రలు, పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులు, ఇతర పారిశుద్ధ్య కార్మికులకు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.నరేంద్రసింగ్ తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, కంటి వైద్యం, సాధారణ శస్త్ర చికిత్స, చెవి, ముక్కు, నోరు, డెంటల్, చర్మవ్యాధులకు సంబంధించి వైద్య సేవలందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఇసిజి, ఎక్స్‌రే, ల్యాబ్ టెస్టులు నిర్వహిస్తారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుతో బాలుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పాము కాటుతో 15 ఏళ్ల బాలుడు దుగ్గిరాల జేసుకుమార్ మృతి చెందిన సంఘటన మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటన పై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి గ్రామానికి చెందిన దుగ్గిరాల జేసుకుమార్(15) మూడు రోజుల క్రితం మండలంలోని బొర్రంపాలెంలో ఉన్న తన మేనత్త గంగమ్మ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి బాలుడు ఇంట్లో నిద్రిస్తుండగా అతని చెవిని కట్లపాము కరిచింది. వెంటనే బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ రహదారిపై కారు, ద్విచక్రవాహనం ఢీ కొని ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ఘటన మండలంలోని దర్భగూడెం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి నుంచి జంగారెడ్డి గూడెం వైపునకు వెళ్తున్న కారు దర్భగూడెం వద్ద గ్రామం లోపల నుంచి ఒక్కసారిగా రహదారి పైకి వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కన ఉన్న తుప్పల్లోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మహిళతో పాటు ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని జంగారెడ్డి గూడెంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బ తిన్నాయి. ఎస్ఐ పి.నవీన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని వెంకటాయపాలెంలో నాటుసారా స్థావరంపై ఎస్ఐ లక్ష్మణ్‌బాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటు సారాను, సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను, అల్యూమినియం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రకృతి వ్యవసాయ కషాయాలు తయారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని బొమ్మినంపాడు కొత్త హరిజనవాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు వరిలో వచ్చే సుడిదోమ నివారణకు ఉపయోగించే తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతం కుమార్ మాట్లాడుతూ పది కేజీల తూటి కాడ ఆకులను 15 లీటర్ల ఆవు మూత్రంలో ఐదు పొంగులు వచ్చేవరకు ఉడికించాలన్నారు. ఇలా ఉడికించిన ద్రావణాన్ని 24 గంటల పాటు చల్లార్చి వంద లీటర్ల నీటిలో కలుపుకుని ఎకరం పొలానికి పిచికారీ చేసుకోవాలన్నారు. దీనివల్ల వరిలో వచ్చే సుడిదోమా సమర్థవంతంగా నివారణ కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఎంటి నారాయణ, ఐసిఆర్‌పిలు సుధాకర్, అనూష, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం ఆ కూడలి

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో మొగల్ చెరువు నుంచి బాపునగర్ వెళ్లే దారిలోని నాలుగు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత సంవత్సర కాలంలో ఈ రోడ్డులో 12కు పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వాహనదారులు గాయాలపాలయ్యారు. ఇదే రోడ్డులో శనివారం ద్విచక్రవాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు. వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆ రోడ్డులో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాపునగర్ వద్ద నాలుగు రోడ్ల కూడలి

భూ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని జగన్నాథపురంలో సిపిఎం ఆధ్వర్యంలో మహాసభ ఆదివారం నిర్వహించారు. సీతారాం ఏచూరి, ఆర్ఎస్, కన్నప్పరాజుల మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. మూడేళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు, సేవా కార్యక్రమాలు, వరద బాధితులకు సహాయం వంటివి చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామ నూతన కమిటీ కార్యదర్శులుగా సోయం చిన్నజయమ్మ, కొరివి రాముడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, వంశీ, గంగరాజు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : కండ్రికగూడెం, తంగెళమూడి ప్రాంతంలో ప్రధాన రహదారులు మరమ్మతులు చేయాలని సిపిఎం తంగెళ్లమూడి శాఖ మహాసభ డిమాండ్ చేసింది. తాపీ మేస్త్రి కాలనీ ఎనిమిదో రోడ్డులో ఆ పార్టీ శాఖ మహాసభ సిహెచ్.దుర్గారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి బి.జగన్నాధరావు మాట్లాడుతూ కండ్రికగూడెం, తంగెళ్లమూడి ప్రధాన రహదారుల్లో రోడ్లు దారుణంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తక్షణమే రోడ్లు మరమ్మతులు చేయాలని కోరారు. పాత పోస్టాఫీస్, దాదా పలావ్ సెంటర్ ప్రాంతంలో రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయని, ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా ఈ ప్రాంతంలో కుక్కల బెడద, పందుల బెడదను అరికట్టాలని అధికారులను కోరారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలపై స్థానిక పార్టీ శాఖ దృష్టి పెట్టి పని చేయాలని మహాసభ తీర్మానించిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.త్రినాధ్, బి.శ్రీనివాసరావు, బి.సిద్ధార్థ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :మండలంలోని పంగిడిగూడెంలో సిపిఎం మూడు శాఖల మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలకు శాఖ సీనియర్ సభ్యులు పెండెం బజార్ అధ్యక్షత వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభ సూచికగా పార్టీ జెండాను ఎ.ప్రభాకరరావు ఎగరవేశారు. శాఖ మహాసభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి జిల్లాల ఉద్యమ నిర్మాత ఆర్ఎస్‌ల మృతికి సంతాపం తెలిపారు. మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. శాఖ నూతన కార్యదర్శులుగా ఎం.బాలయ్య, అందుగుల ప్రభాకరరావు, ఎం.అశోక్‌కుమార్ ఏవగ్రీకంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జి.బాలయ్య, పి.బజార్, కె.సుబ్బారావు, ఎ.రాజశేఖర్, ఎం.సూర్యచంద్రరావు, ఎ.కాంతమ్మ, ఎం.కుమారి, జుత్తిక గొల్ల, డి.సత్యవతి, కె.భారతి, డి.అమ్మాజీ పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే టిడిపి కూటమి ధ్యేయం'

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి ఏలూరు సిటీ

ప్రజా సంక్షేమమే ధ్యేయమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు 42వ డివిజన్ కొత్తపేట నూకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడేటి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యత స్వీకరించిన వంద రోజుల్లోనే ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. తాను ఎంఎల్ఏగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మున్సిపల్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి డ్రెయిన్ల పూడికలు తీయించడం వల్ల ఇటీవల భారీ వర్షాలు కురిసిన చుక్కనీరు కూడా గంటల తరబడి రోడ్లపై నిల్వ లేకుండా పోయిందని చెప్పారు. విజయవాడలో వరదలు సంభవించినప్పుడు ఏలూరు నియోజకవర్గం నుంచి దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో దాదాపుగా రూ.కోటి సాయం అందించామని తెలిపారు.

టి.నరసాపురం :అల్లంచర్ల భూ సమస్య నెలరోజుల్లో పరిష్కరించి నిరుపేదలకు పంచేందుకు కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని అల్లంచర్లలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బాలరాజు కూటమి ప్రభుత్వం వందరోజుల్లో అమలు చేస్తున్న పథకాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు భూసమస్యతో పాటు గ్రామ సమస్యలు ఎంఎల్ఎకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ భూపంపిణీ చేసే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూ పంపిణీ విషయంలో దళారులను నమ్మొద్దన్నారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులను భయభ్రాంతులకు గురి చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే ఆ యాక్ట్‌ను రద్దు చేసిందన్నారు. అధికారం చేపట్టిన వందరోజుల్లోనే వంద పథకాలు అమలు చేస్తున్న ఘనత ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే దీపావళికి ఉచిత గ్యాస్ పథకం అమలవుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో కేవలం రూ.50 లక్షలతో నియోజకవర్గంలో సీసీ రోడ్లు నిర్మిస్తే వంద రోజుల్లోనే రూ.20 కోట్ల ఎన్ఆర్ఇజిఎస్ నిధులు మంజూరు చేసి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి కమిటీ సూచనల మేరకు రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ రామకృష్ణ, కరాటం సాయి, గడ్డమడుగు రవికుమార్, జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, నాయుడు రామకృష్ణ గౌడ్, అడపా నాగరాజు, నెల్లూరి వెంకట చలపతిరావు, పి.మధు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలంతా ఆస్వాదించాలని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ఆదివారం గొల్లగూడెం, వివపురం, కాకర్లమూడిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గోడలకు స్టిక్కర్లను అంటించి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. గొల్లగూడేన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని గ్రామస్తులకు ధర్మరాజు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు కె.శ్రీనివాసరావు, నాగపండు, జనసేన, టిడిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పెదగొన్నూరు, దాకారం గ్రామాల్లో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ కామినేని శ్రీనివాస్ పాల్గొని గ్రామస్తులకు వంద రోజుల్లో చేసిన వంద మంచి పనులను వివరిస్తూ గ్రామస్తుల గుమ్మాలకు ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను అంటించారు. అనంతరం గ్రామ అడబడుచులకు ప్రభుత్వం చేస్తున్న సీమంతం వేడుకలో పాల్గొని వారిని ఆశీర్వదించారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

కలిదిండి : మండలంలోని ఇరిగేషన్ భూముల్లో అనేక ఏళ్లుగా నివాసముంటున్న వారికి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని, అంతర్గత రోడ్లు బాగు చేయాలని, గ్రామాల్లో ఫిల్టర్ నీళ్లు సరఫరాకు సరిపడా ఫిల్టర్ బెడ్స్ నిర్మించాలని, వీధికుక్కల బెడదను నివారించాలని కోరుతూ కలెక్టర్‌కు వెట్రిసెల్వికి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందించారు. మండలంలోని భాస్కరరావుపేటలో జరిగిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు వీరవల్లి భాస్కరరావు, బుస్సా రామనాగేంద్రం, దొంగ వెంకట సత్యనారాయణ, కె.రమేష్, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

వరద బాధితుల సహాయార్థం మంత్రికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - చాట్రాయి

విజయవాడ వరద బాధితుల సహాయార్థం చాట్రాయి మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విరాళాలు సేకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకటరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఎస్‌కె.హసీనా తుమ్మగూడెం గ్రామంలో విరాళాలు సేకరించారు. రూ.ఐదు వేల చెక్కును వరద బాధితుల సహాయార్థం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఆదివారం అందించారు.

నేడు ఉపాధి హామీపై ప్రజా వేదిక

జీలుగుమిల్లి :మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2023 - 24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజా వేదిక (సోషల్ ఆడిట్) కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయ అవరణలో సోమవారం నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ ఎపిఒ జాన్ వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధి హామీ (డ్వామా) అధికారులు పాల్గొని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి జరిగిన ఆడిట్ వివరాలను ప్రజా వేదిక ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సంబంధిత శాఖల అధికారులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు హాజరై వివరాలు తెలుసుకోవాలని కోరారు.

ముత్తారెడ్డికి పీతల సుజాత పరామర్శ

చింతలపూడి :ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న టిడిపి సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డిని మాజీ మంత్రి పీతల సుజాత ఆదివారం పరామర్శించారు. అనంతరం ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరు చంద్రశేఖర్ రెడ్డి సతీమణిని పరామర్శించారు. టిడిపి నాయకులు మోరంపూడి ఈశ్వర్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మోరంపూడి ఈశ్వర్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామం, డో.నెం.8-60/3 గ్రామ కాపురస్తులు **కొడాటి సత్యనారాయణ గారి భార్య వెంకటదుర్గ** గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.., నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలు ఆస్తిని మొగళ్ళపు సూరన్న గారి కుమారుడు మొగళ్ళపు దశరథ రామయ్య ద్వారా డాక్యుమెంటు నెం.8476/2022, తణుకు ఎస్.ఆర్.ఓ.లో రిజిష్టర్ కాబడిన క్రయ దస్తావేజు రిత్యా పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్తిని గతంలో తేది 19-12-2011న కోమటి శివ నాగేశ్వరరావు గారు, చిటికిన హరినాథ్ గారికి డాక్యుమెంటు నెం.5719/2011 ద్వారా క్రయపరచినారు. సదరు దస్తావేజును తేదీ ది.17-04-2021న కోమటి శివ నాగేశ్వరరావు గారు చిటికిన హరినాథ్ గారికి 2432/2021 కాన్సిలేషన్ డీడ్ ద్వారా 5719/2011, తణుకు ఎస్.ఆర్.ఓ.లో జరిగిన క్రయ దస్తావేజును రద్దు పరచడమైనది. సదరాస్తికి చెందిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.5719/2011 (తణుకు ఎస్.ఆర్.ఓ) మరియు 2432/2021 (తణుకు ఎస్.ఆర్.ఓ) పోయినదని దొరికియుండలేదని చెప్పి నా క్లయింటును నమ్మించి విక్రయించినందున సదరాస్తిపై, పోయిన దస్తావేజులకు ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు వగైరాలు ఉన్నచో 7 రోజులలోపు వ్రాత పూర్వకంగా ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలెనని, గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొంది సదరు ఆస్తిని తనఖాగా ఉంచి ఋణము పొందుదురు అని మరియు గడువు అనంతరము వచ్చు ఆక్షేపణలు వగైరాలు నా క్లయింటు హక్కులను బైండు చేయజాలవు.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా, భీమవరం రిజిస్ట్రారు వారి పరిధిలోని, తణుకు సబ్‌డి, ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామ పంచాయితీ ఏరియాలోని మోర్త గ్రామం తాలూకు రి.స.నెం.139/1ఎ దాఖలా డో.నెం.8-74రు గల ఇంటికి సమీపము గల చ॥గ॥81.25లు ఆర్.సి.సి. బిల్డింగుకు కొలతలు, హద్దులు:
తూర్పు: అ॥29-00లుకు చిటికిన కృష్ణమూర్తి గారి తాలూకు బిల్డింగు.
పడమర: అ॥36-00లుకు చిటికిన నాగ మునేంద్రరావు గారి తాలూకు స్థలము. **ఉత్తరం:** అ॥21-00లుకు రాచమళ్ళ వెంకట్రావు గారి తాలూకు గోడ. **దక్షిణం:** అ॥24-00లుకు మోర్త టు వెలగదుర్రు రోడ్డు.

పమ్మి వీరభద్రుడు, అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. సెల్: 77023 11197

అంబేద్కర్ ఫ్లెక్సీని చింపిన ఎంఎల్ఎపై చర్యలు తీసుకోవాలి

దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి మోహన్

ప్రజాశక్తి - పోలవరం

అంబేద్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించిన ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలవరంలో దళితులు భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఉండి ఎంఎల్ఎ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఎపై రాజద్రోహం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఎపై చర్యలు తీసుకునేవరకూ నిరసన తెలుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు న్యాయవాది సొబ్బన ఆనంద్, సీనియర్ పాత్రికేయులు సొబ్బన రాజశేఖర్ బాబు, బచ్చల వెంకటరమణ, నాగార్జున, కుంజం నాగబాబు, కొండే యేసు పాల్గొన్నారు.

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
I.A.No.535/2024, I.A.No.241/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants

TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.535/2024 ఇన్ ఐ.ఎ.నెం. 241/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
I.A.No.537/2024, I.A.No.243/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants

TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.537/2024 ఇన్ ఐ.ఎ.నెం. 243/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
I.A.No.536/2024, I.A.No.242/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants

TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.536/2024 ఇన్ ఐ.ఎ.నెం. 242/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937